విశాలాంధ్ర
గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

జగనన్న విద్యాకానుక కిట్ల తనిఖీ

విశాలాంధ్ర -తాడేపల్లిగూడెం: జగనన్న విద్యా కానుక కిట్లను జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి ఆకస్మిక తనిఖీలు చేశారు. శనివారం తాడేపల్లిగూడెం మండలం పడాల గ్రామంలోని పాఠశాలలో, పెంటపాడు మండలం పెంటపాడు లో పోస్ట్ బేసిక్ స్కూల్లో జగనన్న విద్యాకానుక కిట్లను జిల్లా కలెక్టరు పరిశీలించారు. స్కూల్ బ్యాగ్‌లు, యూనిఫామ్, బూట్లు, ఇతర వస్తువులను క్షుణ్ణంగా జిల్లా కలెక్టరు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో 1413 పాఠశాలల్లోని విద్యార్థినీ, విద్యార్థు లకు జగనన్న విద్యాకానుక కిట్లు అందజేయనున్నట్లు కలెక్టరు తెలిపారు. జిల్లాలో జగనన్న విద్యా కానుక పథకం క్రింద 2023-24 విద్యా సంవత్సరంలో నాల్గవ విడత గా ఒకటవ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుకునే విద్యార్థినీ, విద్యార్థులకు ఒక్కొక్కరికీ సుమారు రెండు వేల రూపాయల విలువ గల విద్యా కానుక కిట్‌లను అందజేయనున్నట్లు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పి.శ్యామ్ సుందర్, ప్రత్యేక అధికా రులు ,జిల్లా హార్టికల్చరు అధికారి ఏ.దుర్గేష్ , జిల్లా పంచాయతీ అధికారి జివి మల్లిఖార్జునరావు, తహశీల్దార్లు, యంపిడివోలు, విద్యా శాఖ అధికారులు, ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తది తరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన చినవెంకన్న ఆలయం

విశాలాంధ్ర-ద్వారకాతిరుమల : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయం శనివారం భక్తులతో క్రిక్కిరిసిపోయింది. శుక్రవారం రాత్రికే సుమారు 5వేలమంది భక్తులు కాలినడకన చేరుకున్నారు. వేకువజాము నుండి ఆలయ పరిసరాలు, టికెట్‌కౌంటర్ల వద్ద భక్తులు బారులు తీరారు. సాదారణ దర్శనానికి 3గంటలు సమయం పట్టింది. టోల్‌గేట్‌వద్ద వాహనాలు నిలిచిపోవడంతో భక్తులు అసహనానికి గురయ్యారు. శ్రీవారి నిత్యాన్నదానంలో సుమారు 10వేలమంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. 40వేలకు పైగా భక్తులు స్వామిని దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు వెల్లడించాయి. శ్రీవారి నిత్యార్జితకళ్యాణాల్లో సుమారు 200జంటలు పాల్గొన్నాయి. హైదరాబాద్‌కి చెందిన కాటూరి వివేకానంద దంపతులు శ్రీవారి నిత్యాన్నదానానికి లక్షరూపాయలు విరాళాన్ని ఆలయ ఏఈవో పతికి నటరాజ్‌కి అందజేశారు. భక్తులకు చాలినన్ని ఆర్‌టిసి బస్సులు లేక ఇబ్బందులు పడ్డారు. గుడిసెంటర్ వద్ద, బైపాస్‌రోడ్డులో వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కి తీవ్ర అంతరాయం ఏర్పడింది. శని, ఆదివారాల్లో ట్రాఫిక్ పోలీసులను ఏర్పాటుచేయాలని గ్రామస్థులు కోరుకుంటున్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో వివేకానంద గ్లోబల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-తణుకు: సిబిఎస్ఈ (న్యూ ఢిల్లీ) పదవ తరగతి ఫలితాల్లో స్థానిక వివేకానంద గ్లోబల్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించారు.43 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవగా 43 మంది ఉత్తీర్ణత సాధించారు. యక్కల జయశ్రీ సూర్య నాశ్రీ హాసిని (465/500)మార్కులతో 93 శాతంతో మొదటి స్థానం, యర్రంశెట్టి నవ్యశ్రీ లక్ష్య సూర్య, చిట్టూరి స్ఫూర్తి (450/500)మార్కులతో 90శాతంతో రెండవ స్థానం, బండ శ్రీచరణ్ (448/500)మార్కులతో 89.6శాతంతో మూడవ స్థానంలో నిలిచారు. పాఠశాల కరెస్పాండెంట్ చిట్టూరి ఉషారాణి పరీక్షలలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, పాఠశాల అధ్యాపక బృందాన్ని అభినందించారు. పాఠశాల సెక్రటరీ చిట్టూరి రీనాసాయి, ప్రిన్సిపాల్ రాయుడు రవీంద్రనాద్, వైస్ ప్రిన్సిపాల్ జెట్టిబోయిన విజయ్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

సాధనతోనే వృత్తి నైపుణ్యాలు

విశాలాంధ్ర-భీమవరం: సాధనతోనే వృత్తి నైపుణ్యాలను పెంచుకోవాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ కె.వి.సుబ్బరాజు పేర్కొన్నారు. ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో "మనసు లోని భావాలను వృద్ధి చేసుకోవటం" అనే అంశంపై ఇంజనీరింగ్ అధ్యాపకులకు నిర్వహించే ప్రత్యేక శిక్షణ శనివారం ప్రారంభమైంది. కళాశాల క్వాలిటీ అసెస్మెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ వేణురెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ సుబ్బరాజు మాట్లాడుతూ సాధనతో సాధించలేనిది ఏమీ లేదన్నారు. ప్రస్తుతం అధ్యయనం సాధన చేయాలనే ఆలోచన ఉంటే అవకాశాలు మెండుగా ఉన్నాయని నొక్కి చెప్పారు. ప్రతి ఒక్కరూ ఒక లక్ష్యాన్ని ఎంపిక చేసుకోవాలన్నారు. దాన్ని అందిపుచ్చుకునేందుకు నిపుణుల సహకారం వారి సూచనలు స్వీకరిస్తే లక్ష్యాలు వాటంతటవే దరిచేరుతాయని ఆయన పేర్కొన్నారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.మురళీకృష్ణమరాజు, పలు కళాశాలల నుంచి విచ్చేసిన అధ్యాపకులు పాల్గొన్నారు.

బాలలు ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

విశాలాంధ్ర -భీమవరం: బాలలు చిన్నతనం నుంచే ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని ప్రస్తుత కాలుష్యంతో కలిగిన ఆహార పదార్థాలతో అంతుపట్టని వ్యాధులు వస్తున్నాయని ప్రముఖ వైద్యులు డాక్టర్ గంధం విశ్వేశ్వరరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతుల్లో ఆయన శనివారం పిల్లల ఆరోగ్యం పై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంక్ ఫుడ్స్ జోలికెళ్లొద్దని, అమ్మ చేతి వంటే అమృతమన్నారు. అనంతరం ఆయన బాలలకు డ్రాయింగ్ బుక్స్, విద్యా సామగ్రి బహుమతిగా అందచేసి స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో భాగంగా నీతి కథలు ,పుస్తక పఠనం,పుస్తక సమీక్ష, యోగ, చిత్రలేఖనం, నృత్యం తదితరాంశాలపై ఉపాధ్యాయులు తరగతులు నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వర రావు, సంఘసేవకులు చెరుకువాడ రంగసాయి, అరసవల్లి సుబ్రహ్మణ్యం, కలిగోట్ల గోపాలశర్మ, తుమ్మలపల్లి బాలాజీ, డి.శ్యామ్, కె.శ్యామల, ఎస్.లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.



గణేశ్వరరావు మృతికి ఎమ్మెల్యే నివాళులు

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు మండలం నారాయణపురం గ్రామ మాజీ సర్పంచ్ పెద్దిరెడ్డి గణేశ్వరరావు గుండెపోటుతో మృతి చెందడంతో శనివారం ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసు బాబు గణేశ్వరరావు పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గణేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండల వైసీపీ కన్వీనర్ మరడ వెంకట మంగరావు, తదితరులు ఉన్నారు.

మట్టి తోలకాల జోరు-పట్టించుకోని అధికారులు

మైనర్లే డ్రైవర్లు-టేపురికార్డర్ల హోరు

విశాలాంధ్ర-మండవల్లి: నిబంధనలకు పాతర వేస్తూ మండలంలో మట్టి తోలకాలు జోరుగా సాగుతున్నాయి. భూముల ధరలకు రెక్కలు రావటంతో పూడికలకు పదుల సంఖ్యలో వాహనాల్లో మట్టి తరలిపోతున్నా అధికారులు ఆవైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మట్టికి గిరాకి ఏర్పడటంతో ఖరీఫ్‌వరి కోతలు ఆరంభమైన డిశెంబరు నెల నుండే మట్టి తోలకాలు ఊపందుకోగా అక్రమార్కులకు మట్టి వ్యాపారం వరంగా మారింది. మండలంలో పెరికెగూడెం, అయ్యవారి రుద్రవరం గ్రామాలు కేంద్రంగా మట్టి వ్యాపారం జోరుగా సాగుతోంది. అనుమతులతో పనిలేకుండానే మట్టి ట్రాక్టర్లు రోడ్లపై యథేచ్ఛగా తిరుగుతున్నాయి. జగనన్న కాలనీల్లో నివాసాలకు మట్టిని తరలిస్తున్నామని చెబుతూ పెద్ద ఎత్తున ప్రైవేటు స్థలాల్లో పూడికలు చేపడుతున్నారు. ఇప్పటికే చావలిపాడు,భైరవపట్నం గ్రామాల్లో చేపల చెరువులను పూడిక చేశారు.

అనుమతుల్లేకుండానే...మట్టి తోలకాలు చేపట్టాలంటే మైనింగు శాఖ నుండి అనుమతులు తప్పనిసరిగా పొందాలి. మొదట రెవిన్యూ శాఖకు దరఖాస్తు చేస్తే ఆప్రాంతాన్ని వారు పరిశీలించి ఎన్ని ఘనపు మీటర్లు, ఎంత విస్తీర్ణంమేర తవ్వకాలు జరపవచ్చో నిర్ణయిస్తారు. ఆ మేరకు రుసుము కట్టించుకుంటారు. స్థలాలు పూడికకు నాలాపన్నును చెల్లించాలి. గతంలో వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన తొలినాళ్లలో అక్రమ మట్టి వ్యాపారం చేస్తూ ప్రభుత్వాదాయానికి గండి కొట్టిన టిడిపి నేతలకు భారీగానే జరిమానాలు విధించారు.మట్టి వ్యాపారంతో అక్రమ సంపాదనకు అలవాటు పడిన వారందరు ఏపార్టీ అధికారంలో ఉంటే ఆపార్టీలో చేరటం మట్టివ్యాపారాన్ని చేయటం ఆనవాయితీగా మారిపోయింది. అక్రమార్కులకు గ్రామ స్థాయి అధికారులు పూర్తి సహకారాన్ని అందిస్తున్నారనే ఆరోపణలున్నాయి. నెలవారి మామూళ్లు తీసుకోవటమే కాకుండా పలు సంస్థల ప్రతినిధులకు జేబులు నింపుతున్నారు. అయ్యవారిరుద్రవరం నుండి మండవల్లికి మూడు కిలోమీటర్లు దూరం ఉండగా పెద్ద ఎత్తున మట్టి తరలింపు సాగుతోంది. ట్రక్కు మట్టిని 900 నుండి వెయ్యి రూపాయలకు విక్రయిస్తున్నారు. దూరం పెరిగితే ధరలను పెంచేస్తున్నారు. అయ్యవారిరుద్ర వరం గ్రామసచివాలయం ముందర నుండే మట్టి తరలింపు సాగుతున్నా అధికారుల్లో చలనం లేకపోవటం విమర్శలకు తావిస్తోంది.

విద్యార్థులే డ్రైవర్లు: అయ్యవారిరుద్రవరం నుండి మండవల్లి మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లకు 8 నుండి పదవ తరరగతి చదువుతున్న విద్యార్థులే ఎక్కువ మంది డ్రైవర్లుగా ఉన్నారు.వేసవి శెలవులు కావటంతో చిన్నారులే డ్రైవర్ల అవతారం ఎత్తి పెద్ద ఎత్తున ధ్వనులు చేస్తూ టేపురికార్డర్ల హోరుతో వాహనాలు నడుపుతు రహదారులపై వెళ్లే వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. దివ్యాంగ పింఛను తీసుకునే బాలుడు మితిమీరిన వేగంతో ట్రాక్టర్‌ను నడపటం గమనార్హం.

మట్టి తోలకాలపై తహసీల్దారు సతీష్‌ను వివరణ కోరగా అక్రమ తోలకాలను అడ్డుకుంటామన్నారు. ఎస్సై రామకృష్ణ సైతం వాహన తనిఖీలు ముమ్మరం చేస్తామని మైనరు డ్రైవర్లను నిలువరిస్తామని తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

సి.బి.యస్.ఇ 10వ తరగతి ఫలితాలలో విజ్ఞాన్ ప్రభంజనం

విశాలాంధ్ర - ఏలూరు : సి.బి.యస్.ఇ 10 వ తరగతి ఫలితాలలో భోగాపురం విజ్ఞాన్ వరల్డ్ వన్ స్కూల్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించి అత్యుత్తమ ఫలితాలతో ఏలూరు,జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచారని

స్కూల్ ప్రిన్సిపాల్ బి.ఎన్.ఎస్.మణి తెలిపారు. లేఖశ్రీ సిరసాల 97 శాతం మార్కులతో టాపర్‌గా నిలిచిందని, కేశవ శ్రీహర్ష 96శాతం సమీహ మహమ్మద్ 96శాతం సాధించి ద్వితీయ, త్రిశంకు 95.6 శాతంతో తృతీయ స్థానంలో నిలిచారని తెలిపారు . కె .రుషిత 95శాతం,పి. బ్రాహ్మిణి 95శాతం, ఎల్. అభినవ్ 94.2శాతం, జి.వేదవర్షిత్ 94శాతం,పి లిఖిత94శాతం లతో ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు. 6గురు 95శాతం, 20 మంది 90 శాతం,48 మంది 80 శాతం పైన మార్కులు సాధించారన్నారు.100 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. గణితంలో లేఖశ్రీ 100కు100 సాధించి రికార్డు నెలకొల్పిందని తెలిపారు. తెలుగులో 100కు 99 ఎనిమిది మందికి, గణితంలో 100 99నలుగురికి, ఆంగ్లంలో100 కి 98ఒకరు, సైన్స్ లో100కి98 ఒకరు,సోషల్ 100కి ఇద్దరు, హిందీలో100కి ఒకరు సబ్జెక్ వారీగా ఉత్తమ మార్కులు సాధించారని తెలిపారు ఈ ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులను, ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను విజ్ఞాన్ సంస్థ చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు కృష్ణదేవరాయులు, ప్రిన్సిపాల్ మణి, మేనేజరు అప్పారావు సిబ్బంది అభినందించారు.

మాజీ సర్పంచి గణేశ్వరరావు గుండెపోటుతో మృతి

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు మండలం నారాయణపురం గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ పెద్దిరెడ్డి గణేశ్వరరావు (73) శనివారం గుండె పోటుతో మృతి చెందారు. ఆయన హయాంలో నారాయణపురంలో ఇందిరమ్మ కాలనీ 16 ఎకరాలకు పైబడి విస్తీర్ణంలో 672 మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి జిల్లాలో అత్యంత వేగంగా అభివృద్ధి అయిన కాలనీగా పేరు సాధించడంలో గణేశ్వరరావు కృషి ఉందని కాలనీ వాసులు తెలిపారు. ఆయన మృతికి ఉంగుటూరు ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు జయలక్ష్మి మండల ఎంపిటిసి చాంబర్ అధ్యక్షులు బందారు నాగరాజు, మండల సచివాలయ కన్వీనర్ డాక్టర్ పెనుగొండ బాలకృష్ణ, గ్రామ వైసీపీ అధ్యక్షులు పైడి అరుణ్ కుమార్, పలువురు ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

బాధ్యతలు స్వీకరించిన సందీప్

విశాలాంధ్ర - లింగపాలెం : వెదర్ పరిశ్రమ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన సొంగా సందీప్ తాడేపల్లి కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు. ఈ సంస్థ ఎండీ తము డోలా శంకర్ ఈయనకు బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ సీఎం జగన్ తనపై నమ్మకంతో ఈ సంస్థకు డైరెక్టర్‌గా నియమించటంపై కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఇచ్చిన పదవికి న్యాయం చేస్తానని అన్నారు.

ఎంపీ పర్యటన

విశాలాంధ్ర - లింగపాలెం : ఎంపీ కోటగిరి శ్రీధర్ శనివారం లింగపాలెం మండలంలో పర్యటించారు. ధర్మాజీగూడెం, శింగగూడెం, రంగాపురంలలో పర్యటించిన ఎంపీ పార్టీ పటిష్టతకు ప్రతీ ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని కోరారు. సీఎం జగన్ రాష్ట్ర అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని అన్నారు. ఈయనతోపాటు లిడ్ క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్, మండల పార్టీ అధ్యక్షుడు కొఠారు మోహన్, పలువురు సర్పంచ్‌లు, ఎంపిటీసిలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో బాలికకు గాయాలు

విశాలాంధ్ర-టి నరసాపురం: విద్యుత్ షాక్ తో బాలికకు గాయాలైన సంఘటన మండలంలో శనివారం చోటు చేసుకుంది. వెలగపాడు గ్రామానికి చెందిన వరదల మురళి కుమార్తె ఇంటి డాబా పై ఆడుకుంటుండగా ఆట వస్తువు సమీపంలో ఉన్న విద్యుత్ తీగలకు తగిలి విద్యుత్ షాక్ తో బాలిక కాళ్ళు చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు బాలికను జంగారెడ్డిగూడెం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న విద్యుత్ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ తీగల క్రింద ఇల్లు కడితే ప్రమాదమని పలుసార్లు హెచ్చరించినా వినిపించుకోక పోవడం వలనే ప్రమాదం జరిగిందని వారు తెలిపారు.

సీఆర్‌పి మృతి

విశాలాంధ్ర - లింగపాలెం : లింగపాలెం మండలంలోని కె.గోకవరం క్లస్టర్‌లో సిఆర్‌పిగా పనిచేస్తున్న తాడేపల్లి వెంకటరత్నం(45) శనివారం మృతి చెందాడు. స్వల్ప అనారోగ్యంతో ఏలూరు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఈయనకు మూత్ర పిండాలు పాడవటంతో చికిత్స పొందుతూనే మృతి చెందారు. ఈయన మృతిపై ఉపాధ్యాయులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈయన స్వగ్రామం భోగోలు. ఈయన భార్య ఝాన్సీ పెదపాడు మండలంలో సిఆర్‌పిగా పనిచేస్తున్నారు. ఈయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈయన మృతి పట్ల ఉపాధ్యాయులు నివాళులర్పించారు. మంచి వ్యక్తిగా పేరున్న వెంకటరత్నం మృతిపై భోగోలు ప్రజలు, ఉపాధ్యాయులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

రెండు లారీలు ఢీ - తప్పిన ప్రమాదం

విశాలాంధ్ర - లింగపాలెం : బొగ్గులోడు, చేపల లోడుతో ఉన్న లారీలు రెండు ధర్మాజీగూడెం పోలీస్‌స్టేషన్ సమీపంలోని ప్రధాన రహదారిపై ఢీ కొన్నాయి. శనివారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. లారీలు ఢీ కొన్న సంఘటనతో ట్రాఫిక్‌కు అంతరాయం వాటిల్లింది. బొగ్గు లోడు లారీ గుంటూరు జిల్లా మాచర్ల, చేపల లోడు లారీ బొంబాయి వెళ్తున్నాయి. లారీలలో డ్రైవర్‌లతోపాటు ఒక క్లీనర్ మాత్రమే ఉన్నారు. వీరికి స్వల్ప గాయాలయ్యాయి. పెద్ద ప్రమాదం తప్పటంతో స్థానికులు సైతం ఊపిరి పీల్చుకున్నారు. లారీల ముందు భాగాలు నుజ్జు అయ్యాయి. ఈ సంఘటనపై పోలీసులకు అందిన ఫిర్యాదుతో దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధ దంపతులకు చేయూత

విశాలాంధ్ర-వీరవాసరం: మానవత్వంతో వృద్ధ దంపతులకు చేయూతనిచ్చిన సామాజిక కార్య కర్త శివ రామకృష్ణ, ఎస్ఐ రమేష్ లను పలువురు గ్రామ పెద్దలు, గ్రామస్థులు అభినందించారు. వీరవాసరం హిందూ శ్మశాన వాటికలో నిరాశ్రయు లైన వృద్ధ దంపతులు ముర్రి అప్పారావు భార్య కన్నమ్మల దీన పరిస్థితిపై మీడియా సహకారంతో సామాజిక కార్యకర్త శివ రామకృష్ణ శనివారం వెలుగులోకి తీసుకువచ్చారు. దీంతో వెంటనే స్పందించిన ఎస్ఐ రమేష్, ఎంపిటిసి గుల్లిపల్లి విజయలక్ష్మి, కనకదుర్గమ్మ ఆలయ కమిటీ చైర్మన్ కందుల సురేష్, ఆర్ఐ రూస్వెల్ట్, జనసేన నాయకులు నారాయణ గిరీష్ సహకారంతో వృద్ధ దంపతులను స్థానిక తులసీ కల్యాణ మండపంలో వసతి, భోజన సదుపాయాలు ఏర్పాటు చేశారు. నడవలేని స్థితిలో ఉన్న అప్పారావు తన సొంత ఖర్చుతో శుభ్రం చేయించి, కొత్త బట్టలు కొని ఇచ్చి కల్యాణ మండపం వద్దకు ఆటోలో తరలించారు.

నూకశాతం పేరుతో ధాన్యం దోపిడీని అరికట్టాలి

విశాలాంధ్ర-వీరవాసరం: ఇప్పటికే పీకల్లోతు కష్టాల్లో ఉన్న కౌలురైతులను నూక, తేమ శాతం పేరుతో మిల్లర్లు చేస్తున్న దోపిడీని అరికట్టాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలులో 1153, 1156 రకం ధాన్యానికి అదనంగా రెండు కేజీలు పట్టడం పైన, మిల్లర్లు తేమశాతం పేరుతో అక్రమంగా డబ్బులు కట్టించుకోవడం పైన మత్స్యపురి రైతుభరోసా వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూకశాతం పేరుతో మిల్లర్ల దోపిడీకి తలొగ్గిన అధికారులు ఏరకం ధాన్యం అయిన నూక కింద ఒక కేజీ అదనంగా ఇవ్వాలని చెప్పారన్నారు. వీరవాసరం మండల వ్యవసాయ అధికారులు మాత్రం 1156,1153 రకానికి అదనంగా రెండు కేజీలు ఇవ్వాలని చెప్పడం దారుణమన్నారు. ఇప్పటికే క్వింటాకి 3 సార బస్తాలు పడుతుంటే 3 కేజీలు అవుతుందని అలాంటిది అదనంగా రెండుకేజీలు పడుతుంటే రైతులు ప్రతీ క్వింటాకి 120రూపాయలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యంతో రైతాంగం మరింత నష్టపోతున్నార న్నారు. ఈ సమస్యను పౌరసరఫరాల శాఖ జిల్లా అదికారి ఏ.ఎస్.ఓ, భీమవరం ఆర్డీఓ దాసి రాజు దృష్టికి తీసుకెళ్ళగా వెంటనే స్పందించిన ఆయన మట్లాడుతూ ఏ రకం ధాన్యం అయినా సంచితో కాకుండా ఒక కేజీ మాత్రమే ఇవ్వాలని తెలియ జేశారు. డబ్బులు కట్టించుకునే మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కౌలు రైతులు చింతా నారాయణమూర్తి, ముచ్చర్ల వీరప్రభాకరావు,చింతా సూర్యనారాయణ, నిప్పులేటి అప్పారావు, పిప్పళ్ళ నాని, రావూరి సూర్యనారాయణ, గంటా ఆంజనేయులు, ఈర్ల బాబ్జీ, పుప్పాల పాములు తదితరులు పాల్గొన్నారు.

దొరికిన సెల్ ఫోన్లు పోలీసులకు అందజేత

విశాలాంధ్ర-వీరవాసరం: నిజాయితీగా తనకు దొరికిన వస్తువులను పోలీసులకు అప్పగించి తన గొప్ప మనసును చాటుకోవటం అభినందనీయ మని ఎస్ఐ పి.రమేష్ తెలిపారు. గ్రామానికి చెందిన విద్యుత్ శాఖలో షిఫ్ట్ ఆపరేటర్ గా పనిచేస్తున్న చిరంజీవికి రెండు సెల్ ఫోన్లు రోడ్డుపై దొరకగా, వాటిని ఎస్ఐ రమేష్ కు సహృదయంతో అప్పగించారు. దీంతో ఎస్ఐ, ఇతర పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్దలు చిరంజీవిని అభినందించారు. ఈ విషయాన్ని తెలుసుకుని సెల్ ఫోన్ కోల్పోయిన వ్యక్తులు పోలీస్ స్టేషన్ కి రాగా ఎస్ఐ రమేష్ వారికి సెల్ ఫోన్లు అప్పగించారు.

కేసుల పరిష్కారంలో రాజీమార్గం ఉత్తమమైనది

విశాలాంధ్ర -కైకలూరు : కేసుల పరిష్కారంలో రాజీమార్గం ఉత్తమమైనదని సీనియర్ సివిల్ జడ్జి కె. షణ్ముఖరావు, జూనియర్ సివిల్ జడ్జి బి. శ్రీనివాసులు అన్నారు.స్థానిక కోర్టు వద్ద శనివారం మెగా లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు.బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాడెం వీర వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన లోక్ అదాలత్ కార్యక్రమంలో పలు కేసులు రాజీ మార్గంలో పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఎం ఎస్ ఎస్ రాజు, జాయింట్ సెక్రెటరీ చావలి శంకర శాస్త్రి, లైబ్రరీ సెక్రటరీ కె. రమాదేవి, ఏపీపీ వీ శ్రీరామ్ చంద్రమూర్తి, సీనియర్ న్యాయవాదులు గురజాడ ఉదయ్ శంకర్, టి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

27న కృష్ణ, పశ్చిమగోదావరి జిల్లాల ప్రాంతీయ సదస్సు

విశాలాంధ్ర -ఏలూరు : ఏపీ జేఏసీ అమరావతి మూడో దశ పోరాట కార్యక్రమంలో భాగంగా ఈ నెల 27వ తేదీన ఏలూరులో ఏలూరు, పశ్చిమగోదావరి, కృష్ణా, జిల్లాల ప్రాంతీయ సదస్సును జయప్రదం చేయాలని శనివారం నాడు ఏలూరులో జరిగిన ఏపి జేఏసీ అమరావతి ఏలూరు జిల్లా రౌండ్ టేబుల్ సమావేశం పిలుపునిచ్చింది. శనివారం ఏలూరు రెవెన్యూ భవన్లో ఏపీ జేఏసీ అమరావతి రౌండ్ సమావేశం ఏలూరు జిల్లా ఏపి జెఎసి చైర్మన్ రమేష్ కుమార్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఏపి జెఎసి అమరావతి ఏలూరు జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, కృష్ణాజిల్లా అధ్యక్షులు సతీష్, పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి ప్రసాద్ రాజు, ఏఐటియుసి ఏలూరు జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు, సిఐటియు జిల్లా నాయకులు దొర, పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మహాలక్ష్మి, ఏపి జెఎసి అమరావతి నాయకులు జ్యోతి, రాఘవరావు, గోపి, వైయస్ తదితరులు మాట్లాడారు. ఏపి జెఎసి అమరావతి మొదటి, రెండో దశ పోరాట ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం పాత బకాయిల తాలూకా సుమారు రూ.5800కోట్లు విడుదల చేసిందని జేఏసీ నాయకులు తెలిపారు. మూడో దశ పోరాటం ద్వారా సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్‌ని సాధించడం, బకాయి పడ్డ సరెండర్ లీవులు డిఏ లు ఇతర ఆర్థికపరమైన సమస్యలు పరిష్కారం అవటానికి ఆస్కారం ఉంటదని జేఏసీ నాయకులు తెలిపారు. ఈ నెల 27 శనివారం ఏలూరులో జరిగే ప్రాంతీయ సదస్సును ఉద్యోగులు, కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు, పెన్షనర్లు, కార్మిక సంఘాల కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఏపి జేఏసీ అమరావతి నాయకులు విజ్ఞప్తి చేశారు.

నేడు విశాలాంధ్ర రాము సంస్మరణ సభ

విశాలాంధ్ర -ఏలూరు: స్వాతంత్ర సమరయోధులు, కమ్యూనిస్టు శతాధిక వృద్ధుడు తాన్న రామారావు(విశాలాంధ్ర రాము) సంస్మరణ సభ ఆదివారం జరుగుతుందని ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరావు తెలిపారు. ఆదివారం ఉదయం గం.10:30లకు ఏలూరు రాణి నగర్ లో రామారావు ఇంటి వద్ద సభ జరుగుతుందని బండి వెంకటేశ్వరరావు తెలిపారు.

చంద్రబాబు క్షమాపణ చెప్పాలి

విశాలాంధ్ర-తణుకు: టిడిపి అధినేత చంద్రబాబు వైకాపా నేతలపై చేస్తున్న అనుచిత వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలని తణుకు నియోజకవర్గ వైసీపీ నాయకులు అన్నారు. నియోజకవర్గంలో శుక్రవారం చంద్రబాబు చేపట్టిన పాద యాత్రలో రాష్ట్ర పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి డాక్టర్ కారుమూరి వెంకట నాగేశ్వరరావు పై చేసిన అనుచితమైన వ్యాఖ్యలకు నిరసనగా వైసీపీ నాయకులు శనివారం స్థానిక నరేంద్ర కూడలి లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ కార్యక్రమంలో శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, పట్టణ అధ్యక్షులు మంగెన సూర్య,మాజీ ఎఎంసి చైర్మన్ చిట్టూరి సుబ్బారావు, ముళ్లపూడి అన్నపూర్ణ దేవి,వైసీపీ నాయకులు వివిధ గ్రామాల సర్పంచ్లు, ఎంపీటీసీలు, ఏయంసీ డైరెక్టర్లు, పంచాయతీ బోర్డు సభ్యులు, కారుమూరి అభిమానులు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జనరల్‌నాలెడ్జితో పోటీ పరీక్షల్లో విజయం

విశాలాంధ్ర-మండవల్లి: విద్యార్థి దశనుండే జనరల్‌నాలెడ్జిపై పట్టు సాధిస్తే పోటీ పరీక్షల్లో విజయం తధ్యమని గ్రంథపాలకురాలు షేక్ పర్వీన్ అన్నారు. మండవల్లి లైబ్రరీలో జరుగుతున్న వేసవిశిక్షణా శిబిరాల్లో భాగంగా చిన్నారులకు జనరల్‌నాలెడ్జిపై అవగాహన ,నీతికథలలో నీతిని వివరించారు .పుస్తక పఠనాన్ని ఇష్టంగా చేపట్టాలని పర్వీన్ బాలలకు సూచించారు .ఎండలు ఉధృతంగా ఉన్న తరుణంలో ఎండలో తిరగవద్దని గ్రంథాలయంలోని శిక్షణా తరగతుల్లో పాల్గొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని పర్వీన్ విద్యార్థులకు తెలిపారు.

తాగునీటి సరఫరాపై స్పందించని ఎమ్మెల్యే

విశాలాంధ్ర-భీమడోలు: పూళ్ళ యం.యం.పురం నాగేశ్వరరావుపేట కొత్తపేట కురెళ్ళగూడెంలో గురువారం వచ్చిన తుపాను ప్రభావంతో విద్యుత్, తాగునీరు లేక జనం ఇబ్బందులు పడుతుంటే ఉంగు టూరు ఎమ్మెల్యే ఇంతవరకు స్పందించని కారణంగా జనసేన, టిడిపి నాయకులు కలిసి ప్రజలకు శనివారం ఇంటింటికి వాటర్ ట్యాంకులు పట్టుకుని వెళ్లి నీరు సరఫరా చేశారు. ప్రజలు అనేక అవస్థలు పడుతుంటే స్థానిక శాసనసభ్యులకు చీమకుట్టినట్టైనా లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.విద్యుత్ లేకపోవడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని తక్షణం విద్యుత్ సరఫరా చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు

కష్టపడి చదివితే ఎక్కువ మార్కులు సాధించవచ్చు

విశాలాంధ్ర - గణపవరం: విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టి చదివితే ఎక్కువ మార్కులు సాధించవచ్చునని, విద్యా ర్థుల్లో పోటీ తత్వం పెంచుకోవాలని ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల శ్రీనివాసరావు (వాసు బాబు) అన్నారు. శనివారం గణపవరం శ్రీ చైతన్య సిబిఎస్ఈ పాఠశాల విద్యార్థులు 2023 సంవత్సరం పదవ తరగతి పరీక్షల్లో అత్యధికంగా ఫలితాలు సాధించిన సందర్భంగా ఎమ్మెల్యేను క్యాంప్ కార్యాలయంలో కలిశారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పి. రామ్ ప్రకాష్ మాట్లాడుతూ శ్రీ చైతన్య సిబిఎస్ఈ,గణపవరం పాఠశాలలో మొదటి స్థానంలో సిహెచ్ నవ్య శ్రీ (469/500), ద్వితీయ స్థానం జి. పార్థు (440/500), మూడో స్థానం, టి. హాసిని (426/500), నాల్గవ స్థానం ఎ.కీర్తన (425/500), ఐదవ స్థానం బి.అను పృథ్వీక(413/500) సాధి%శీ%చినట్లు తెలిపారు .పాఠశాల విద్యార్థులందరూ 100% ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య పాఠశాల ఎ.జి.యమ్ వై.యన్. శ్రీనివాస్, రీజనల్ ఇన్ చార్జి యస్.పార్థ సారథి, కో ఆర్డినేటర్ ఎ.రామారావు, డీన్ జి.బోసుబాబు, పదవ తరగతి ఇన్‌చార్జి యస్.రామకృష్ణ, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-ఏలూరు: స్మార్ట్ సిటీ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌ఆర్ పేటలోని శ్రీ కృష్ణ హాస్పిటల్ లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిం చారు. ఈ శిబిరంలో ఎముకలు, కీళ్ళు, నరములు, వెన్నెముక, శాస్త్ర చికిత్స వైద్యంలో 10 సంవత్స రాల అనుభవం గల లయన్ డాక్టర్ బి. కృష్ణ బృందం చే ప్రతినెల రెండవ శనివారం ఉచితంగా ఓపి, రక్త పరీక్షలు, ఎక్సరే మొదలైన పరీక్షలు చేశారు. శనివారం ఉదయం నుండి 97 మందిని పరీక్షించి అందరికి ఉచితంగా రక్త పరీక్షలు, బోన్ స్కానింగ్, ఎక్స్‌రేలు చేశారు. వీరితో పాటు డాక్టర్ అఖిల్, మార్కెటింగ్ మేనేజర్ నాగేశ్వరరావు, ఏలూరు స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ టి. అబ్రహాం లింకన్,ఉపాధ్యక్షులు లయన్ సుబ్రహ్మణ్యం , జిల్లా నాయకులు పి. మురళీ కృష్ణ, వి జి ఎం వి ఆర్ కృష్ణారావు,వైద్య బృందం పాల్గొన్నారు. డాక్టర్ కృష్ణ మాట్లాడుతూ ఏలూరు పరిసర గ్రామాల ప్రజలు మా సేవలు వినియోగించు కావాలన్నారు.క్లబ్ అధ్యక్షులు అబ్రహాం లింకన్, ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం, మురళీ కృష్ణ, కృష్ణారావు మాట్లాడుతూ వైద్యం ఖర్చుతో కూడినదని ప్రజలకు సేవ చేయాలనే మంచి ఉద్దేశంతో డాక్టర్ కృష్ణ, బృందం పేద ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్నందుకు క్లబ్ తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వచ్చిన వారందరికి వేసవి కాలం ఎండలు దృష్టిలో పెట్టుకొని మజ్జిగ ప్యాకెట్లు అందించారు. లయన్ టి. అబ్రహాం లింకన్, అధ్యక్షులు మారగాని శ్రీనివాసరావు, కార్యదర్శి షేక్ ముస్తఫా అలీ, తదితరులు పాల్గొన్నారు.

22వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం

విశాలాంధ్ర - పాలకొల్లు: పాలకొల్లు పట్టణం 22 వ వార్డులో శనివారం"గడప గడపకు మన ప్రభుత్వం" 119 వ రోజు కార్యక్రమం శనివారం విజయవంతం గా నిర్వహించారు. నవరత్నాలలో భాగముగా ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందించేందుకు ప్రజలలో ప్రచారం నిర్వహించారు. జిల్లా పరిషత్ చైర్మన్, పాలకొల్లు నియోజకవర్గ వైసీపీ ఇంఛార్జ్ కవురు శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రజల నుండి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాబోయే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్ను ఆశీర్వదించాలని ప్రజలను శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమం వైసీపీ నాయకులు గుణ్ణం నాగబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, పట్టణ అధ్యక్షులు చందక సత్తిబాబు, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పి. పెద్దిరాజు, వార్డు ఇంఛార్జి పిల్లా శ్రీనివాస్, పట్టణ జేసిఎస్ కన్వీనర్ మద్దాల వాసు, గ్రామ సచివాలయ కన్వీనర్ లు, గృహ సారథులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల హర్షం

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక మెజారిటీ సీట్లతో విజయం సాధించడం పట్ల కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు హర్షం వ్యక్తం చేసినట్లు రాష్ట్ర అధికార ప్రతినిధి మద్దాల ప్రసాద్, మాజీ జెడ్పిటిసి సభ్యులు ముప్పిడి శ్రీనివాసరావు తెలియజేశారు. ఈ సందర్భంగా శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.కర్ణాటక విజయం ప్రజా విజయమని,ప్రజలు బిజెపిని తిరస్కరించారనే విషయాన్ని కర్ణాటక ఎన్నికల ఫలితాలు చూస్తే అర్థమవుతుందని ప్రకటనలో పేర్కొన్నారు.ఈ సందర్భంగా స్థానిక పాత బస్టాండ్ లోని కాంగ్రెస్ నాయకులు జెట్టి గురునాథరావు కార్యాలయం వద్ద కాంగ్రెస్ స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం పట్టణంలో ద్విచక్ర వాహనాలపై ప్రదర్శన చేశారు. తీన్మార్ డబ్బులతో సందడి చేశారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు నులకని నాగబాబు, జిల్లా కార్యదర్శి వనచర్ల లింగస్వామి, తాడేపల్లి ఉమాదేవి, రొక్కం ఆదినారాయణ, మొగిలిసీడిశ్యాం, పంగిడిగూడెం కాంగ్రెస్ నాయకులు అడవికొట్టు రవి, జంగా కమలాకర్ రెడ్డి, ప్రసాద్,మామిడి రాము, జమీర్ షరీఫ్, జీడిగింటి రామారావు, మద్దిపాటి శ్రీను వసంతాడు మంగరాజు, ఉన్న శివ, సోమరాజు, దోక్క లక్ష్మణ్, గోలిశ్రీనివాసరెడ్డి, మామిడి రాము, ఎర్ర సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి హనుమాన్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు సాలిపేటలో దాస అంజనేయ స్వామి ఆలయం వద్ద ఆదివారం ఉదయం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరగడానికి అన్ని ఏర్పాటు చేసామని ఆలయ ఆర్గనైజర్ ప్రసాద్ తెలిపారు. ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. హనుమాన్ జయంతి వేడుకలు 16వ తేదీ వరకు జరుగుతాయి. 14, 15 తేదీలలో స్వామివారికి పూజా కార్యక్రమం నిర్వహిస్తారు. 16 వ తేదీ మంగళవారం భారీ అన్న కార్యక్రమం జరుగుతుందని భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

గంజాయి తాగుతుండగా అరెస్టు

విశాలాంధ్ర-వీరవాసరం: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో రైల్వే గేట్ సమీపంలో అన్నపూర్ణ లాజిస్టిక్స్ గోడౌన్స్ వెనుక గంజాయి తాగుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులో తీసుకుని సోదా చేయగా వారి వద్ద నుండి సుమారు 90 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని వారిపై అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి, ఎన్డిపిఎస్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు.

లింగపాలెంలో సబ్ డివిజన్ స్థాయి స్పందన

విశాలాంధ్ర - లింగపాలెం : నూజివీడు సబ్ డివిజన్ పరిధిలో ఉన్న మండలాలకు స్పందన కార్యక్రమాన్ని లింగపాలెం తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహిస్తున్నట్టు తహశీల్దార్ ఆర్.వి.మురళీకృష్ణ తెలిపారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాలతో సబ్ డివిజన్ స్థాయి స్పందన లింగపాలెంలో ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ స్పందనలో సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ పాల్గొంటారని అన్నారు.

వేసవి శిబిరాలు ఉపయోగకరం

విశాలాంధ్ర-వీరవాసరం: వేసవి శిబిరాలు విద్యార్థినీ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతున్నా యని పలువురు ప్రముఖులు తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులకు దేశభక్తి గీతాలను రిసోర్స్ పర్సన్ పిఎవి లక్ష్మి, డ్రాయింగ్ సైన్సు ప్రయోగాలు, పాటలు, డాన్స్ మల్లుల శ్రీనువాస్ లు నేర్పించారు. బండారు అప్పారావు ఆటలు ఆడించారు. గ్రంథాలయాధికారి హనుమంతురావు ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో 43 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

విష ప్రయోగంతో చేపలు మృతి

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం : స్థానిక మున్సిపల్ కార్యాలయం ప్రక్కనే ఉన్న అక్కమ్మ కోనేరు (రజక) చెరువులో చెరువులో విష ప్రయోగం జరిగి చేపలు మృతి చెంది న ఘటనలో రూ. 4లక్షల 50వేల నష్టం వాటిల్లిందని రజక సంఘ నాయకులు మందపల్లి లక్ష్మయ్య, తూటిగుంట దుర్గారావు తెలిపారు.ఈ సందర్భంగా రజక సంఘ నాయకులు తెలిపిన వివరాల ప్రకారం గతంలో రెండుగా ఉన్న రజక సంఘం ప్రస్తుతం ఒక్కటిగా కలిసి ఉందని, గత మూడు నెలల క్రితం తమ సంఘం తరపున చేప పిల్లలు చెరువులో వేశామని తెలిపారు.చేపలు పెరిగి పెద్దవవడంతో మరి కొద్ది రోజుల్లో చేపలను పట్టి విక్రయించాలనుకునే సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చెరువులో విష ప్రయోగం చేశారని దీంతో చెరువులో చేపలన్నీ చనిపోయి పైకి తేలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా స్థానిక ఎస్ ఐ సాగర్ బాబు చెరువు వద్దకు వచ్చి చనిపోయిన చేపలను పరిశీలించారు. సంఘ నాయకులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాగర్ బాబు తెలిపారు .

ప్రజా సంక్షేమమే ధ్యేయం

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం : ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిపాలన అందిస్తున్నారని చింతలపూడి ఎమ్మెల్యే వి ఆర్ ఎలిజా అన్నారు.శనివారం మండలం లోని మైసన్నగూడెం గ్రామ సచివాలయం పరిధి లో గడప గడప కు

మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఎలిజా నిర్వహించారు.ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలతో తమ సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదో అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పోల్నాటి బాబ్జి, సర్పంచ్ సింగిదాసు హైమవతి, మండల సచివాలయల కన్వీనర్ గురజాల పార్థసారధి , మండల యువ నాయకుడు గంజి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో వినోదం

విశాలాంధ్ర-ముసునూరు: వేసవిలో యువకులకు క్రికెట్ మంచి వినోదాన్ని ఇస్తుందని మాజీ రైతు సంఘం నాయకులు అక్కినేని చందు,సూరేపల్లి గ్రామపార్టీ అధ్యక్షులు మల్లిబాబు పేర్కొన్నారు. శనివారం మండలంలోని సూరేపల్లి గ్రామంలో పొన్నగంటి చందు యూత్ ఆధ్వర్యంలో ప్రిమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు జరుగుతుండగా,పర్వతనేని గంగాధరరావు ప్రైజ్ మనీ నిమిత్తం రూ. 60.000 ఇచ్చినందుకు ఆయన్ని అభినందించారు.శోభనపురం గ్రామ సర్పంచ్ నక్కనబోయిన వేణు,తదితరులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరం

విశాలాంధ్ర- కొయ్యలగూడెం : విద్యార్థులు చిన్ననాటి నుండి గ్రంథాలయాలను అలవాటు చేసుకోవాలని ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయులు జి.శేఖర్ తెలిపారు. శాఖా గ్రంథాలయం వద్ద జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు , నీతి కథలు, చదవడం, రాయడం పై పలు సూచనలను విద్యార్థిని విద్యార్థులకు శేఖర్ సూచించారు. గ్రంథాలయంలోని వేసవి విజ్ఞాన శిబిరం విద్యార్థులకు ఏర్పాటు చేసి ఆరవ రోజు పూర్తి అయ్యిందని, ఇంకా కొద్ది రోజులు విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తామని, గ్రామంలోని ఉన్న తల్లిదండ్రులు తమ పిల్లలను గ్రంథాలయాలకు అలవాటు చేయాలని, చిన్ననాటి నుండే విద్యార్థులను గ్రంథాలయాలకు అలవాటు చేస్తే , విజ్ఞానంతో పాటు లోకజ్ఞానం కూడా తెలుస్తుందని , ప్రతిరోజు వివిధ సబ్జెక్టులకు సంబంధించిన ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారని గ్రంథ పాలకురాలు యు. రాముడు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

16న మినీ జాబ్ మేళా

విశాలాంధ్ర - ముమ్మిడివరం : ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 16న మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి శాఖ అధికారి పి.లోకమాన్ తెలిపారు. ఈ జాబ్ మేళాలో మూడు కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని పదో తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ, బిటెక్, బి ఫార్మసీ వరకు చదివి పాసైన అభ్యర్థులు ఈ ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చునని తెలిపారు.

డ్రైనేజీ పూడికతీతలు

విశాలాంధ్ర - కరప : కరప మండల గ్రామాలలో స్పెషల్ శానిటైజేషన్ డ్రైవ్ షెడ్యూల్లో భాగంగా శనివారం కరప, వేలంగి, కొంగోడు, గురజనాపల్లి, గొరుపూడి, నడకుదురు, వేములవాడ, యండమూరు, అరట్లకట్ట, తదితర గ్రామాలలో డ్రైనేజీలలో పూడికతీతలు, కచ్చ డ్రైన్లు శుభ్రపరచినట్టు మండల పంచాయతీ విస్తరణ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. అన్ని గ్రామాలలో యుద్ధ ప్రాతిపదికన పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్య సిబ్బందితో పూడిక తొలగించారు. నీరు నిలవుండే ప్రదేశాలలో నీరు పోయే మార్గాలను శుభ్రం చేసామన్నారు. ఈనెల 22వ తేదీ వరకు గ్రామాలలో ఉన్న పనులను చేపడుతున్నామన్నారు.

15 మందిపై కేసు నమోదు

విశాలాంధ్ర - చాగల్లు : వాహన ప్రమాదాలను అరికట్టాలనే ఉద్దేశ్యంతో చాగల్లు మండలంలో గత వారం రోజులుగా ప్రతి రోజూ స్పెషల్ డ్రైవ్ నిర్వహించి సరైన పత్రాలు లేని, ప్రమాదకరం గా వాహనాలు నడిపే వ్యక్తులపై కేసులు నమోదు చేయనున్నట్టు ఎస్సై సి హెచ్ వి రమేష్ తెలిపారు. ఈ క్రమంలో శుక్రవారం 15 మంది వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్టు ఆయన అన్నారు . ఇప్పటివరకు ఈ విధంగా 45 మంది పై కేసులు నమోదు చేసి న్యాయస్థానం హాజరుపరిచామన్నారు. ప్రజలందరు సరైన వాహన పత్రాలు కలిగి ఉండాలని, ప్రమాదభరితంగా కాకుండా సరైన రీతిలో వాహనాలు నడపాలని తద్వారా వాహన ప్రమాదాలను అరికట్టాలనేది పోలీస్ వారి ఉద్దేశమని ఎస్సై సిహెచ్ వి. రమేష్ తెలిపారు.

అంగన్వాడీ భవనానికి శంకుస్థాపన

విశాలాంధ్ర - బిక్కవోలు : బిక్కవోలు మండలం ఆరికరేవుల గ్రామంలో శనివారం కొత్తగా అంగన్వాడీ భవనానికి అనపర్తి ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం వైఎస్ జగనన్న కాలనీలో కొత్తగా కరెంటు ట్రాన్స్ఫార్మర్‌ను రాష్ట్ర పంచాయతీ రాజ్ సెక్రటరీ, మండల కన్వీనర్ పోతుల ప్రసాదరెడ్డి (బుజ్జి) ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల జెసిఎస్ కన్వినర్ బొడ్డు ముత్యాలరావు,(గామ అభివృద్ధి కమిటీ చైర్మన్ తొండాపు గాంధీ రెడ్డి, ఎంపీటీసీ కొర్ల చక్రధరరావు, ఉప సర్పంచ్ శాఖ రాజు తదితరులు పాల్గొన్నారు.

600 రోజులుగా నిరసన

- విధుల్లోకి తీసుకోవాలని జిజిహెచ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆందోళన
- హైకోర్టు ఉత్తర్వులు అమలు చేయాలని డిమాండ్

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో తొలగించిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, సిబ్బంది ఆందోళన శనివారం నాటికి 600 రోజులకు చేరుకుంది. 2021 సెప్టెంబరులో 65 మంది కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ సిబ్బందిని, 2022 జూన్‌లో 89 వికాస ఔట్ సోర్సింగ్ సిబ్బందిని జిల్లా అధికారుల ఆదేశాల మేరకు విధుల నుంచి ఆసుపత్రి యాజమాన్యం తొలగించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి తమకు న్యాయం చేయాల్సిందిగా హైకోర్ట్ ఆదేశాలను అమలు చేయాలంటూ ఆసుపత్రి ఎదుటే నిరశన దీక్షలు ప్రారంభించారు. మండుటెండను, కుంభవృష్టి వర్షాన్ని కూడా లెక్కచేయకుండా గత 600 రోజులుగా నిరసన కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా సిఐటీయు నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు మాట్లాడుతూ కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో అడ్డగోలుగా తొలగింపులు జరుగుతున్నాయని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు వారి ఉత్తర్వులను కూడా జిజిహెచ్ అధికారులు లెక్కచేయడం లేదన్నారు. యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు డిఎ రతన్ రాజ్, జిజిహెచ్ నాయకులు జి నాయుడు, శానిటేషన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సిహెచ్ విజయ్ కుమార్లు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఉద్యమానికి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నాయకులు పిఎస్ రాయుడు, సిహెచ్ ఏడుకొండలు, చక్రవర్తి, దుర్గా లక్ష్మి, అరుణ, వసంత, బేబి రాణి, లలిత, దయానంద్, రమణ, శ్రీనివాస్, పవన్, శివ శంకర్, ధనుంజయ్, ప్రసాద్, మౌలాలీ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుకు నిధులు కేటాయించాలి

విశాలాంధ్ర-తిరువూరు: భవన నిర్మాణ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డుకు నిధులు కేటాయించి, పెండింగ్ క్లైములు వెంటనే పరిష్కరించాలని ఎన్టీఆర్ జిల్లా బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి షేక్ ఉమర్ వలీ డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల చేపట్టిన జిల్లా కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ తిరువూరులో శనివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. సంఘ మండల కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఉమర్ వలీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డు నిధులను ఇతర పథకాలకు మళ్ళించడం శోచనీయమన్నారు. 2006లో సంక్షేమ బోర్డు ప్రారంభించినప్పటి నుంచి 22లక్షల మంది కార్మికులు లబ్ధిపొందారన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ నాలుగేళ్లలో 32వేల క్లైములు పెండింగ్ లో ఉన్నాయని ఆరోపించారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డుకు కేటాయించిన 1600 కోట్ల నిధులు ప్రభుత్వం పవర్ కార్పొరేషన్ వాడుకోవడం వల్ల కార్మికుల కుటుంబాలు నానా అవస్తలు పడుతున్నారని ఉమర్ వలీ ఆవేదన వ్యక్తంచేశారు. ఏఐటీయుసీ నియోజకవర్గ కార్యదర్శి కొత్తపల్లి సుందరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో నూతన ఇసుక పాలసీ అమలు చేసి భవనాల నిర్మాణానికి కావలసిన ఇసుక అందుబాటులో లేకుండా చేయడం వల్ల నిర్మాణ రంగం నిలిచిపోయిందన్నారు. చేయడానికి పనులు లేక, పూట గడవక 32 మంది కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆయన విమర్శించారు. ఇసుక ధర టిప్పరు రూ. 32 వేలకు చేరడంతో స్టీలు, సిమెంటు, కంకర, ఇనుము ధరలు కూడా విపరీతంగా పెరిగి భవన నిర్మాణ రంగం స్తంభించి పోయిందని, దీని ఫలితంగా కార్మికులు పస్తులు పడుకునే దుస్థితి దాపురించిందని సుందరరావు ఆరోపించారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునః ప్రారంభం చేసి, పెండింగ్లో ఉన్న క్లైములన్ని పరిష్కరించాలని ఉమర్ వలీ, సుందరరావు డిమాండ్ చేశారు. ఈ నెల 15న విజయవాడ ధర్నా చౌక్ వద్ద జరిగే మహా ధర్నాకు బిల్డింగ్ వర్కర్స్ వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ తిరువూరు మండల ప్రధాన కార్యదర్శి షేక్ నాగుల్ మీరా (కార్పెంటర్), సంఘ నాయకులు షేక్ అబ్దుల్ హుస్సేన్, కొలేటి గోపాలరావు, పింగళి శ్రీనివాసరావు, షేక్ సుభానీ, కామాల రామారావు, మాదాసు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత చదువులకు 'మేమున్నాం' వితరణ

విశాలాంధ్ర-పెడన: పెడన మరియు చుట్టుపక్కల ప్రాంతాల్లో నిరుపేద కుటుంబాలకు, వృద్ధులకు, మేమున్నాం సేవా సంస్థ ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తామని సంస్థ సభ్యులు తెలిపారు. పెడన పట్టణంలోని బ్రహ్మపురం నిరుపేద చేనేత కుటుంబానికి చెందిన నున్న సాయి పావని నూజివీడు పాలిటెక్నిక్(ఈ సి ఈ) మొదటి సంవత్సరం ఫీజు 30,000/- కాగా, తక్షణ సహాయంగా 10,000/- లు నగదును వారి తల్లి శ్యామల గౌరీ కి వితరణగా అందించారు. ఆమె చదువుకు సహకరించాలనుకునే, వివిధ స్వచ్ఛంద సంస్థలు వారు మరియు మనసున్న మారాజులు సాయి పావని ఉన్నత చదువుల ఆశయ సాధనకు సహకరించాలని 9032272388 ఈ నెంబర్ కి వివరాలు తెలపాలని కోరారు.

రాష్ట్ర సర్వతో ముఖాభివృద్ధికి మహాయజ్ఞం

విశాలాంధ్ర-విజయవాడ : రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని రాష్ట్ర సర్వతో ముఖాభివృద్ధికి నిర్వహిస్తున్న మహా యజ్ఞాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం లో ఈ నెల 17 వరకు రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న అష్టోత్తర శత(108) కుండాత్మక చండి,రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీ లక్ష్మీ మహా యజ్ఞం నిర్వహణపై శనివారం డిప్యూటీ సీఎం, రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ మీడియా పాయింట్ వద్ద పాత్రికేయుల సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహా యజ్ఞం రెండో రోజుకు చేరుకుందన్నారు. శాస్త్రోక్తంగా, శాస్త్రీయంగా ఇటువంటి యజ్ఞం ఎక్కడా జరగలేదని ఇది ఒక అత్యద్భుత కార్యక్రమం అని, ఎవరు ఊహించిన విధంగా పురాతన ఇతిహాసాలలో మునులతో అలనాటి మహారాజులు నిర్వహించే మహా యజ్ఞ కార్యక్రమాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖ నిర్వహించడం గొప్ప విషయం అని ప్రతి భక్తుడు భక్తితో పరవశిస్తున్నారన్నారు. ఈ మహా యజ్ఞంలో దేవాదాయశాఖ అధికారులు, రెవెన్యూ, పోలీస్, నగరపాలక సంస్థ, విద్యుత్, ఫైర్ అన్ని శాఖలకు చెందిన వారు సహకారం అందిస్తున్నారని ఇది వారు తమ అదృష్టంగా భావిస్తున్నారన్నారు. మహా యజ్ఞాన్ని, ఇక్కడి పవిత్ర కృతులను చూసిన ప్రతి భక్తుడు తమ జన్మ తరించిందని ఇటువంటి మహాభాగ్యాన్ని చూసే అదృష్టాన్ని కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారన్నారు. ప్రతిరోజు చతురాగమ యాగశాలల యందు, 108 కుండములలో హోమం, అర్చనలు నిర్వహిస్తున్నారన్నారు. ప్రధాన యాగశాలలో అగ్ని మథనం, అగ్ని ప్రతిష్ట 108 కుండములలో అగ్నిస్థాపన, హోమాలు జరుగుతున్నాయన్నారు. తమిళనాడు నుండి వచ్చిన రుత్విక్కులతో వారి ఆచారం మేరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. 550 మందికి పైగా రుత్వికులు, వారికి సహాయంగా 300 మంది యజ్ఞ యాగ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారన్నారు. 32 మంది సన్నాయి, డోలు వాయిద్య కళాకారులు శాస్త్రోక్తంగా యాగశాలకు అనుసంధానం చేస్తూ వారి సహకారం అందిస్తున్నారన్నారు. యాగశాలకు భక్తులు వేలాదిగా తరలివస్తున్నారని అన్నారు. యాగశాలను సందర్శించే భక్తులకు ఎటువంటి పాసులు అవసరం లేదని, భక్తులు మహా యజ్ఞాన్ని దర్శించుకునేందుకు దేవాదాయశాఖ అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. సాయంత్రం నిర్వహించే కార్యక్రమంలో కొద్ది మార్పులు చేశామన్నారు. సాయంత్రం ఐదు గంటల నుండి 6:30 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, 6:30 నుండి 7:30 వరకు ప్రవచనాలు, 7:30 నుండి స్వామి అమ్మవార్ల కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తామన్నారు. భక్తులు యాగశాలను దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించి తరించుకోవాలని డిప్యూటీ సీఎం, రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మాత్యులు కొట్టు సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు.ఈ పాత్రికేయులు సమావేశంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఆర్. సత్యనారాయణ మరియు దేవాదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

తనిఖీల పేరుతో వేధింపులు మానుకోవాలి

విశాలాంధ్ర-విజయవాడ : తనిఖీల పేరుతో రాష్ట్రంలో ఉన్న ఓకేషనల్ కళాశాలల యాజమాన్యాలను ప్రభుత్వం వేధింపులకు గురిచేస్తోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఓకేషనల్ జూనియర్ కళాశాలల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి శాంతి కుమార్ ఆవేదన వ్యక్తంచేశారు. శనివారం నగరంలోని ఒక హోటల్‌లో అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా లక్షలాది రూపాయలు వసూలు చేస్తూ కనీస సౌకర్యాలు కల్పించని కార్పొరేట్ కళాశాలలకు ఇంటర్ బోర్డు కొమ్ముకాస్తుందని ఆరోపించారు. ఎక్కువ మొత్తల్లో ఫీజులు చెల్లించలేని గ్రామీణ ప్రాంతాల్లోని బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పిస్తున్న ఓకేషనల్ కళాశాలపై తరచుగా ఇన్స్పెక్షన్ పేరుతో దాడులు చేయడం దారుణమని అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఇన్స్పెక్షన్ లు రద్దు చేసి కళాశాలల ఉనికిని కాపాడాలని కోరారు. అదేవిధంగా కళాశాలలకు బోధనా రుసుమును పాతవిధానం లోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు.

భవానీపురంలో భారీగా గంజాయి

విశాలాంధ్ర-విజయవాడ క్రైం: విజయవాడ భవానీపురం పోలీసులు భారీగా గంజాయిని పట్టుకున్నారు. సుమారు 20కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కృష్ణలంకకు చెందిన ముగ్గురు, సింగ్‌నగర్‌కు చెందిన ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళ్లితే భవానీపురం ఆట్కిన్‌సన్ స్కూల్ రోడ్డులోని నిర్మాష్య ప్రాంతంలో యువకులు ఉన్నారని సమాచారంతో సీఐ అబ్దుల్ సలాం, ఎస్సై అనూషలు యువకుల పై దాడి చేసి వారి వద్ద నుండి 20 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ యువకులకు బంధువులైన మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా నుండి ఈ గంజాయి తీసుకువచ్చినట్లు సమాచారం. కేసు నమోదు చేసిన పోలీసులు మరో ఇద్దరి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

వక్ఫ్ బోర్డు ప్రత్యేక అధికారిని దూషించిన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు

విశాలాంధ్ర-విజయవాడ క్రైం: ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ బోర్డు ప్రత్యేక అధికారి షరీన్ బేగంను అసభ్యపదజాలంతో దూషించి, అభ్యంతరకర విధంగా ప్రవర్తించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఆమె పీఏ ముర్దార్ అన్సారీ శనివారం వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వైఎస్సార్ జిల్లా సిద్దవటానికి చెందిన పిర్ సయ్యద్ షా షబ్బీర్ అహ్మద్ ఆలం ఖాద్రి ఈ నెల 11వ తేదీన వక్ఫ్ బోర్డు ప్రత్యేక అధికారి షరీన్ బేగంను దూషిస్తూ అసభ్యకరంగా ప్రవర్తించాడని, ఆమె విధులకు ఆటంకం కల్పించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తక్షణమే అతనిపై చర్యలు తీసుకోవాలని కోరాడు. విజయవాడ వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోర్టు నిర్మాణంతో బందరు దశ మారబోతుంది

విశాలాంధ్ర, మచిలీపట్నం : బందరు పోర్టు ద్వారా కృష్ణాజిల్లా దిశ మారనుందని దశాబ్దాల కల నెరవేరబోతుందని బందరు పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి ఆశభావం.వ్యక్తం చేశారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలో శనివారం బందరు పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ బందరు పోర్టు ఈనెల 22వ తేదీన జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా పనులు ప్రారంభమవుతున్నాయని స్పష్టం చేశారు. ఇప్పటికీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి 3 వేల.941 కోట్లు మంజూరు అయ్యాయి అన్నారు. పోర్టు పనుల నిమిత్తం 5 వందల కోట్లు రిలీజ్ అయినట్టు ఆయన వెల్లడించారు.ఈ పోర్టు ద్వారా రైల్వే కనెక్టివ్ టీ కోసం మచిలీపట్నం రేపల్లె కొత్త రైల్వే లైను నిర్మించేందుకు ప్రభుత్వంతో చర్చలు జరిపామని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కూడా తెలియజేశామని అవసరమైతే దీని ప్రాజెక్టు చేర్చి 7 వందల కోట్లతో అమలు చేసే దివిసీమ ప్రజల కోరిక నెరవేరుతుందని ఎంపీ తెలిపారు.

తాగునీరు ఏది... శుద్ధ కృష్ణాజలాలు ఎక్కడ?

గుక్కెడు తాగునీరు కోసం విలవిలలాడుతున్న గిరిజన తండాలు
పట్టించుకోని పాలకులు, అధికారులు
ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు

విశాలాంధ్ర-ఎ కొండూరు : మండలంలోని గిరిజన తండాలు గుక్కెడు శుద్ధకృష్ణా జలాల కోసం ఎదురు చూస్తున్నాయి. మధ్య అసలే ఈ ప్రాంతంలో ఉన్న నీటిలో సిలికా ఉన్నదని ప్రభుత్వ అధ్యయనాల ద్వారా తెలిసిన విషయం అందిరికీ తెలిసిందే... ఐతే ఈ ప్రాంతంలో 15 సంవత్సరాలుగా కిడ్నీ వ్యాధులతో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. కొంత మంది వ్యాధి భారినపడి మంచన మూలుగుతున్నాను. ఈ ప్రాంతంలో ఈ తరహా క్రానిక్ కిడ్నీ డిసీజ్‌కీ కారణం మాత్రం తాగునీటిలో అధిక శాతం సిలికా ఉండటమే ప్రధాన కారణం అని ప్రభుత్వా అధికారులు తేల్చారు. ప్రాంతంలో ఉన్న కిడ్నీ సమస్యను పరిష్కరించే దిశగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ఆర్‌డబ్ల్యూఎస్ఎస్సి వెంకటరమణలు ఒక ప్రణాళిక ప్రకారం ప్రతి ఒక్క గిరిజన తండాలో సింటెక్స్ ట్యాంకులను నిర్మించి వాటిలో రెడ్డిగూడెం మండలం కుదప కృష్ణా జలాల సంపు నుండి నీటిని ట్రాక్టర్ ట్యాంకర్ల ద్వారా తరలించి గిరిజన తండాల్లో ఉన్న ట్యాంకర్లలో నింపుతున్నారు.

ఈ ప్రక్రియ మొత్తం గత కొంతకాలం సజావుగా జరిగిన ఈ మధ్యకాలంలో ట్యాంకుల్లో పోసే శుద్ధమైన కృష్ణ జలాలు మురికిగా ఉంటున్నాయని వాటిలో చిన్నచిన్న తోక పురుగు వంటివి కూడా ఉంటున్నాయని గిరిజన తండాలలో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుద్ధమైన కృష్ణా జలాల సమస్యను ఇప్పటికి కొన్ని వందలసార్లు మండల జిల్లా అధికారులతో పాటు స్థానిక అధికార పార్టీ ప్రజా ప్రతినిధులకు తెలియజేశామని కానీ ఏ ఒక్కరూ కూడా సమస్యను పరిష్కరించే దిశగా ఆలోచించడం లేదని గిరిజనులు అంటున్నారు. ఎన్నో వేల కోట్లు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఖర్చు పెట్టే ప్రభుత్వం గుక్కెడు శుద్ధమైన కృష్ణా జలాలను అందించలేకపోవడం సిగ్గుచేటని పలువురు గిరిజన నేతలు ఆరోపిస్తున్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తులకు నెలకు పదివేల రూపాయలు పింఛన్ ఇస్తేనో ప్రభుత్వం మందులు ఉచితంగా ఇస్తేనో సమస్య పరిష్కారం కాదని, ఈ కిడ్నీ మహమ్మారి శాశ్వత పరిష్కారం శుద్ధమైన కృష్ణ జలాలేనని పలువురు అంటున్నారు. ఈ కిడ్నీ సమస్య ఈ ప్రాంతంలో ఇంతలా పెరిగిపోవడానికి ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యమేనని, ఇంత నిర్లక్ష్యం కారణంగానే ఈ కిడ్నీ మహమ్మారి మా తండాలపై పడి వందలాదిమందిని బలి తీసుకుందని పలువురు గిరిజనులు తమ బాధను వెళ్ళగక్కుతున్నారు.

గతంలో మా ఆహారపు అలవాట్లపై మాట్లాడిన రాజకీయ నాయకులు ఇప్పుడు తాగునీరులో సిలికా ఉందని తెలిసిన తర్వాత ఏం సమాధానం చెబుతారని గిరిజనులు నాయకులను సూటిగా ప్రశ్నిస్తున్నారు. ఈ మండలంలో ఇంతలా కిడ్నీ వ్యాధులు ప్రబలి ఉన్న స్థానిక అధికారులు కానీ, జిల్లా అధికారులు గానీ ఏమి పట్టనట్టు వ్యవహరించడం సరికాదని సమస్యను శాశ్వత పరిష్కారం దిశగా పనిచేయాలని కోరుతున్నారు. అలానే రెండు రోజులుగా మండలంలోని మత్రియ తండా చైతన్యనగర్ తండాలలో కృష్ణా జలాలు చాలా మురికిగా వస్తున్నాయని ఆ విషయాన్ని అధికారులు దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడంలేదని ఉమ్మడి జిల్లాల ఎస్ఎఫ్ఐ నాయకుడు కుమార్‌నాయక్ ఆరోపించారు. ఇదే విధంగా కృష్ణాజిల్లాలు సరఫరా విషయంలో ప్రభుత్వం అధికారులు మొండివైఖరి ప్రదర్శిస్తే చూస్తూ ఊరుకునేది లేదని ఆయన అన్నారు.

కిడ్నీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

సీపీఐ మండల కార్యదర్శి మేకల డేవిడ్

కిడ్నీ ప్రభావిత ప్రాంతాల్లో శాశ్వత పరిష్కారం దిశగా శుద్ధమైన కృష్ణా జలాలను తాగునీరుగా అందించాలని తాగునీరుగా వస్తున్న కృష్ణా జలాలు పూర్తిగా మురికిగా ఉండటంతో ఆ నీటిని తాగలేకపోతున్నారని ప్రభుత్వానికి అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా వారి పందానీ మాత్రం మార్చుకోవడం లేదని ఆయన అన్నారు. తాగునీటి విషయంలో ఇదే అలసత్వం అధికారులు ప్రదర్శిస్తే మండల కార్యాలయాలు ముందు ధర్నా కార్యక్రమం చేపడతామని ఆయన ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని అధికారులను హెచ్చరించారు.